సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
బుధవారం। 12। ఏప్రిల్। 2023


అభివృద్ధివైపు నడవండి...
ప్రభుత్వం అందిస్తున్న చేయూతతో అభివృద్ధి వైపు అడుగులు వేయండి. అండగా ఉంటామని ఏఎస్పీ ప్రతాప్ శివకిషోర్ అన్నారు. 8లో


కేజీహెచ్ ఎస్టీ సెల్ ప్రక్షాళన
ఆరోపణలు ఎదుర్కొంటున్న కేజీహెచ్‌లోని ఎస్టీ సెల్‌ను ప్రక్షాళనకు అధికార యంత్రాంగం శ్రీకారం చుట్టింది. 8లో


మహిళలకు అండగా జగనన్న
మహిళలకు అండగా వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నిలిచారని ఎమ్మెల్యేలు ధనలక్ష్మి, చెట్టి పాల్గుణ చెప్పారు. 8లో

రంజాన్ వేళలు

అరకు/పాడేరు:
ఇఫ్తార్ (బుధ) 6-13 సహర్ (గురు) 4-27
రంపచోడవరం:
ఇఫ్తార్ (బుధ) 6-30 సహర్ (గురు) 4-30

భగ్గుమన్న సూరీడు

- చింతూరులో 44.9 డిగ్రీలు నమోదు
- సాధారణం కంటే ఎనిమిది డిగ్రీలు అధికం


పాడేరు పాతబస్టాండ్‌లో ఉదయం 8గంటలకు కురుస్తున్న పొగమంచు


నిర్మానుష్యంగా ఉన్న చింతూరు మెయిన్ రోడ్డు

సాక్షి, పాడేరు: జిల్లాలో ఎండ మండిపోయింది. మంగళవారం పలు ప్రాంతాల్లో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సాధారణ ఉష్ణోగ్రత కంటే ఎనిమిది డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యాయి. వేకువజామున పొగమంచు కురిసినప్పటికీ క్రమేపి ఎండ తీవ్రత పెరిగింది. ఉదయం పది గంటల నుంచే బయటకు రాలేని పరిస్థితి ఏర్పడింది.మధ్యాహ్నం రోడ్లపై జనసంచారం తక్కువగా ఉంది.జిల్లాలోని చింతూరులో 44.9 డిగ్రీలు, ఎటపాకలో 43.6,గంగవరంలో 42.4,అడ్డతీగలలో 41.1, రాజవొమ్మంగిలో 40.4 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.అధిక ఉష్ణోగ్రతలతో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడ్డారు.శీతల ప్రాంతాలుగా గుర్తింపు పొందిన పాడేరు, చింతపల్లి,జీకే వీధి మండలాల్లో కూడా గత మూడు రోజుల నుంచి 33 డిగ్రీల వరకు గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. పాడేరు డివిజన్‌లోని 11మండలాల పరిధిలో రోజూ సాయంత్రం వర్షాలు కురుస్తుండడంతో వాతావరణం చల్లబడుతోంది.

ఫిర్యాదులొస్తే ఉపేక్షించం

- తాగునీటి పథకాల నిర్మాణంలో నాణ్యత పాటించాలి
- కలెక్టర్ సుమిత్ కుమార్


మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి,పాడేరు: జల్‌జీవన్ మిషన్‌లో చేపట్టిన తాగునీటి పథకాల నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు పక్కాగా పాటించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. మంగళవారం తన కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారులతో తాగునీటి పథకాల నిర్మాణాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తాగునీటి పథకాల నిర్మాణాలు పూర్తయిన తరువాత ఫిర్యాదులు వస్తే ఉపేక్షించేది లేదని, తగిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పాడేరు డివిజన్ పరిధిలో 3288 పథకాల పనులు జరుగుతున్నాయని, వాటిని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.ఇంతవరకు జరిగిన పనులకు గాను రూ.28.50 కోట్ల బిల్లులను ఆన్‌లైన్‌లో నమోదు చేశామని తెలిపారు. ఈ సమావేశంలో ఈఈ లీలాకృష్ణ,డీఈఈలు ప్రకాష్,జయరామ్, ఏఈఈలు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల భవనంలోనే స్ట్రాంగ్ రూమ్

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల బాలికల హాస్టల్ పాత భవనంలోనే ఈవీఎంలను భద్రపరిచేందుకు స్ట్రాంగ్ రూమ్‌ను ఏర్పాటు చేస్తున్నామని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు.సాధారణ ఎన్నికల్లో ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్‌కు సంబంధించి భవనాల పరిశీలన కార్యక్రమాన్ని మంగళవారం కలెక్టర్ చేపట్టారు. ముందుగా కుమ్మరిపుట్టులోని ఆర్చరీ శిక్షణ కేంద్రం నిర్వహిస్తున్న మినీ స్టేడియం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనాలను కలెక్టర్ పరిశీలించారు.అధికారులతో సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈవీఎంలను డిగ్రీ కళాశాల బాలికల హాస్టల్ పాతభవనంలోనే భద్రపరుస్తామని,ఈమేరకు భవన కిటీకీలను పూర్తిగా మూసివేయాలని, మినీ స్టేడియంలోని ఆర్చరీ శిక్షణా కేంద్రానికి రంగులు వేసి,మరుగుదొడ్లు నిర్మించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.డిగ్రీ కళాశాల భవనంలో నిర్వహిస్తున్న మూడు ప్రభుత్వ కార్యాలయాలకు గాను ఒకదానిని మినీ స్టేడియంకు,రెండింటిని ఐటీడీఏ కార్యాలయానికి తరలించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జేసీ శివశ్రీనివాస్,సబ్‌కలెక్టర్ అభిషేక్, గిరిజన సంక్షేమశాఖ ఈఈ డి.వి.ఆర్.ఎం.రాజు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

పాడేరు నుంచి ముంపు మండలాలకు బస్సు సౌకర్యం

- పాడేరు ఆర్టీసీ డీపోమేనేజర్ ఆర్‌ఎస్ నాయుడు

కూనవరం: జిల్లా కేంద్రం పాడేరు నుంచి ముంపు మండలాలకు ఆర్టీసీ బస్ సౌకర్యాన్ని త్వరలో కల్పిస్తామని పాడేరు డిపో మేనేజర్ ఆర్.ఎస్. నాయుడు తెలిపారు. స్థానిక బస్టాండ్‌ను మంగళవారం ఆయన సందర్శించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పాడేరు నుంచి రంపచోడవరం వరకు బస్సు సౌకర్యం కల్పించామని, విలీన మండలాల ప్రజలు దాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.కూనవరం, వీఆర్‌పురం, చింతూరు, ఎటపాక మండలాల వారు జిల్లా కేంద్రానికి నేరుగా వెళ్లేందుకు కనీసం రెండు సరీస్సులైనా ఏర్పాటు చేయాలని, భద్రాచలం నుంచి విశాఖ వెళ్లే సర్వీసును వయా కూనవరం, చింతూరు మీదుగా నడపాలని స్థానికులు కోరారు. భద్రాచలం ఆలయం వరకు ప్రత్యేక సర్వీసును ఏర్పాటు చేయాలన్నారు. స్పందించిన నాయుడు మాట్లాడుతూ సర్వీసులు నడిపేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. అనంతరం స్థానికులు డీఎం ఆర్.ఎస్. నాయుడు, సీటీఎం కె.వెంకటరావును సన్మానించారు.

చింతపల్లిలో సినిమా షూటింగ్ సందడి


చిన్నగెడ్డ వద్ద చిత్ర యూనిట్

చింతపల్లిరూరల్: మండలకేంద్రం చింతపల్లికి సమీపంలో చిన్నగెడ్డ వద్ద సినిమా షూటింగ్ సందడి నెలకొంది. నూతన నటీనటులతో ఈ సినిమా తీస్తున్నారు. మంగళవారం నిర్మాత ప్రవీణ పరుచూరి మాట్లాడుతూ పరుచూరి విజయ్ ప్రవీణ ఆర్ట్స్ నిర్మిస్తున్న 'బందీరా' అనే థ్రిలింగ్ కామెడీ సినిమాను నూతన నటీనటులతో తీస్తున్నట్టు చెప్పారు. హీరో, హీరోయిన్లుగా మనోజ్‌చంద్ర,మౌనిక,ఉషా నటిస్తున్నట్టు తెలిపారు. సుమారు 30రోజుల పాటు చింతపల్లి పరిసర ప్రాంతాల్లో చిత్రీకరిస్తామని ఆమె తెలిపారు.

చింతూరులో మరోమారు సర్వే


చింతూరులో సర్వే చేస్తున్న సిబ్బంది

చింతూరు: పోలవరం ముంపు పరిధిలో ప్రాధాన్యతా క్రమంలో చేర్చిన చింతూరులో మరోమారు గృహాల సర్వే మంగళవారం ప్రారంభమైంది. తొలిదశ కాంటూరులో చేర్చిన చింతూరుకు సంబంధించి గతంలో 1,459 ఇళ్లతో ప్రాథమిక నోటిఫికేషన్ వెలువడింది. ప్రస్తుతం దాని ప్రాతిపదికన మరోమారు మార్పులు, చేర్పుల నమోదుతో వలంటీర్లు ఇంటింటా సర్వే చేపట్టారు. గత సర్వేలో నమోదు కాని అంశాలు ఏమైనా ఉంటే వాటిని వలంటీర్లు నమోదు చేయడంతో పాటు ఇల్లు, ఇంటి యజమాని ఫొటోను యాప్‌లో పొందుపరుస్తున్నారు. మరోవైపు నోటిఫికేషన్‌లో వెలువడిన ఇళ్లకు సంబంధించి హౌసింగ్ సిబ్బంది, కార్యదర్శి, వీఆర్‌వో, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వలంటీర్లు కొలతలు నమోదు చేస్తున్నారు. కార్యదర్శి రఘు, వీఆర్‌వో రామచంద్రం, వలంటీర్లు ముత్తయ్య, మహేష్ పాల్గొన్నారు.

రేపటి నుంచి ప్రియారిటీ హాబిటేషన్స్‌లో సర్వే

వీఆర్‌పురం: పోలవరం ప్రాజెక్ట్ ముంపు పరిధిలో ప్రియారిటీ హాబిటేషన్స్‌గా గుర్తించిన గ్రామాల్లో ఈ నెల 13వ తేదీ నుంచి స్ట్రక్చర్ (నివాస గృహాలు) సర్వే నిర్వహించనున్నట్టు తహసీల్దార్ ఎస్.శ్రీధర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.రామవరప్పాడు,అడివివెంకన్నగూడెం, ప్రత్తిపాక, చింతరేగుపల్లి, గుండుగూడెం, రాజీపేటకాలనీ,ధర్మతాళ్లగూడెం,వడ్డిగూడెం,వీఆర్‌పురం గ్రామాల్లో బృందాలు సర్వే నిర్వహిస్తాయని ఆయన చెప్పారు. సర్వే సమయంలో నిర్వాసితులు అందుబాటులో ఉండాలని తహసీల్దార్ కోరారు.

ప్రత్యేక వార్డులు, ఆక్సిజన్ ప్లాంట్ సిద్ధం


పాడేరు జిల్లా ఆస్పత్రిలో ప్రత్యేక వార్డు


పాడేరు జిల్లా ఆస్పత్రిలో ఆక్సిజన్ ప్లాంట్

కోవిడ్‌ను సమర్థంగా ఎదుర్కొనేందుకు అన్ని ఆస్పత్రుల్లో ఏర్పాట్లు

సాక్షి,పాడేరు: కోవిడ్ కేసులు నమోదవుతుండడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. జిల్లాలోని అన్ని ఆస్పత్రుల్లో తగిన ఏర్పాట్లు చేశారు. పాడేరులోని జిల్లా ఆస్పత్రిలో ఆక్సిజన్ ప్లాంట్, ప్రత్యేక వార్డులు సిద్ధం చేశారు. పాడేరు మండలం డోకులూరు సచివాలయం పరిధి గడివలస కొత్తూరులో ఓ గర్భిణికి మంగళవారం కరోనా నిర్ధారణ కావడంతో అలెర్ట్ అయిన అధికారులు తగిన చర్యలు చేపట్టారు. ఆమెకు మెరుగైన వైద్యసేవలు కల్పిస్తున్నారు. జిల్లాలోని అన్ని ఆస్పత్రుల వైద్యులు,సిబ్బంది, ఆస్పత్రులకు వచ్చే రోగులకు మాస్క్‌లను తప్పనిసరి చేశారు.

అందుబాటులో సౌకర్యాలు

కరోనా కేసులు రాష్ట్రంలో నమోదవుతున్న నేపథ్యంలో అల్లూరి సీతారామరాజు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ,వైద్య విధాన పరిషత్ అధికారులను ప్రభుత్వం ముందస్తుగా అప్రమత్తం చేసింది. సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో వైద్య ఆరోగ్యశాఖతో సమీక్షించారు. దీనిలో భాగంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో వైద్య ఆరోగ్య కార్యక్రమాలను తెలుసుకున్నారు.దీంతో వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు జిల్లాపై ప్రత్యేకంగా దృష్టిసారించారు.పాడేరు జిల్లా ఆస్పత్రితో పాటు జిల్లాలోని అన్ని వైద్యవిధాన పరిషత్ ఆస్పత్రుల్లో పూర్తిస్థాయిలో సౌకర్యాలు ఇప్పటికే అందుబాటులో ఉన్నాయి. నెల రోజుల క్రితం జిల్లా ఆస్పత్రి ఆవరణలో ఆక్సిజన్ ప్లాంట్‌ను వైద్యఆరోగ్యశాఖ ప్రారంభించింది.పుష్కలంగా ఆక్సిజన్ అందుబాటులో ఉందని వైద్యులు తెలిపారు. అరకులోయ,చింతపల్లి,రంపచోడవరం ప్రాంతీయ ఆస్పత్రులతో పాటు,ముంచంగిపుట్టు, అడ్డతీగల,చింతూరు,కూనవరం,వై.రామవరం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ల సూపరింటెండెంట్లు, వైద్యబృందాలను అప్రమత్తం చేశారు. ఆక్సిజన్ సౌకర్యంతో కూడిన ప్రత్యేక వార్డులను, ఐసీయూ బెడ్స్,వెంటిలేటర్ బెడ్స్,ఐసోలేషన్ బెడ్లు, మందులు సిద్ధం చేశారు. డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్ బాషా, వైద్యవిధాన పరిషత్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ శంకర్‌ప్రసాద్,జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణారావు సోమవారం రాత్రి సమావేశమయ్యారు.కరోనా నిర్ధారణ పరీక్షలు,రోగులకు జిల్లా ఆస్పత్రిలో అందించే వైద్యసేవలపై సమీక్షించారు.

అన్ని ఆస్పత్రుల్లో ర్యాపిడ్ టెస్ట్‌లు

ర్యాపిడ్ టెస్ట్‌ల కిట్లు జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందుబాటులో ఉంచినట్టు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జమాల్‌బాషా మంగళవారం 'సాక్షి'కి తెలిపారు. ఆర్‌టీపీసీఆర్,వీఆర్‌డీఎల్ పరీక్షలు మాత్రం కేజీహెచ్‌లోని మైక్రో ల్యాబ్‌లో జరుగుతాయని తెలిపారు. కరోనాపై జిల్లా వైద్యఆరోగ్యశాఖ,వైద్యవిధాన పరిషత్‌లు అప్రమత్తంగానే ఉన్నాయని ఆయన తెలిపారు.
– డాక్టర్ జమాల్ బాషా, డీఎంహెచ్‌వో

మారుతున్న 'రూట్'రేఖలు

- వేగంగా జాతీయ రహదారి విస్తరణ
- మలుపులు లేకుండా, కొత్త కల్వర్టులతో నిర్మాణం


చట్టి, భద్రాచలం రహదారిలో కొనసాగుతున్న పనులు


చట్టి, కుంట రహదారిలో సాగుతున్న విస్తరణ పనులు

చింతూరు: విజయవాడ, జగ్దల్‌పూర్ జాతీయ రహదారి–30పై ప్రయాణం మరింత సౌకర్యవంతంగా మారనుంది. రహదారి అభివృద్ధిలో భాగంగా భద్రాచలం నుంచి కుంట వరకు విస్తరణ పనులు వేగవంతంగా సాగుతున్నాయి. రూ.389 కోట్లతో చేపడుతున్న ఈ పనులకు గత ఏడాది అమరావతిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీలు శంకుస్థాపన చేశారు. నిత్యం ఈ రహదారిలో ఆంధ్రా, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, తెలంగాణ, తమిళనాడు, మధ్యప్రదేశ్, మహారాష్ట్రలకు చెందిన వేలాది వాహనాలు ప్రయాణిస్తుంటాయి. విస్తరణ అనంతరం రహదారి పది మీటర్ల వెడల్పు కానుండడంతో ప్రయాణం మరింత సులువుగా సాగనుంది. ప్రస్తుతం భద్రాచలం, కుంట జాతీయ రహదారి–30 విస్తరణ పనులు కొనసాగుతుండగా త్వరలోనే ఆంధ్రా, ఒడిశాల నడుమనున్న జాతీయ రహదారి–326 విస్తరణ పనులు కూడా ప్రారంభమయ్యే అవకాశముంది.

విస్తరణ పనులు ఇలా

భద్రాచలం నుంచి కుంట వరకు 64 కిలోమీటర్ల మేర రహదారి విస్తరణ పనులు చేపడుతున్నారు. ప్రస్తుతం రహదారి ఏడు మీటర్లుండగా ఇరువైపులా మీటరున్నర చొప్పున వెడల్పు చేస్తున్నారు. విస్తరణలో భాగంగా 16 ప్రాంతాల్లో ప్రమాదకరంగా ఉన్న మలుపులను తొలగించి రహదారి నేరుగా ఉండేలా చేస్తున్నారు. మరోవైపు మలుపులున్న ప్రాంతాలను డైవర్ట్ చేయడంతో కొత్త వంతెనలు, కల్వర్టుల ఆవశ్యకత ఏర్పడింది. ఈ క్రమంలో 16 చోట్ల పైపు కల్వర్టులు, 24 చోట్ల శ్లాబ్ కల్వర్టులు, 8 చోట్ల మైనర్ వంతెనలు నిర్మించనున్నారు.

ఐదు గ్రామాలు ప్రభావితం

జాతీయ రహదారి విస్తరణలో భాగంగా ఎటపాక, చింతూరు మండలంలో ఐదు గ్రామాలు ప్రభావితం కానున్నాయి. ఎటపాక మండలంలో వెంకటరెడ్డిపేట, రామగోపాలపురం, బాసవాగు, చింతూరు మండలంలో ఏడుగురాళ్లపల్లి, బొడ్డుగూడెంలో కొంతమంది నివాస గృహాలు, భూములు కోల్పోనున్నారు. దీనిపై ఇటీవల చింతూరు ఐటీడీఏలో రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సల్ సంబంధిత రైతులు, గృహాల యజమానులతో సమావేశమై పరిహారం చెల్లింపు నిమిత్తం వారి డాక్యుమెంట్లను పరిశీలించారు. రహదారి విస్తరణలో భాగంగా ప్రభావితమవుతున్న గ్రామాల్లో భూసేకరణ, అటవీ ప్రాంతాల్లో భూసేకరణ నిమిత్తం ఇప్పటికే ఆయా శాఖలకు పరిహారం చెల్లించినట్టు జాతీయ రహదారి అధికారులు తెలిపారు.

వచ్చే ఏడాదికల్లా పూర్తి

జాతీయ రహదారి పనులు వేగవంతంగా సాగుతున్నాయి. వచ్చే ఏడాది జూలై కల్లా పూర్తయ్యేలా ప్రణాళిక రూపొందించాం. ముంపునకు గురయ్యే ప్రాంతాలపై ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. అనుమతులు రాగానే రహదారిని మరో వైపునుంచిమళ్లిస్తాం. – సుబ్రహ్మణ్యం, డీఈ, జాతీయ రహదారి

చిన్నారులకు నాణ్యమైన ఆహారం సరఫరా

- రాష్ట్ర ఫుడ్ కమిటీ చైర్మన్ సీహెచ్ విజయ ప్రతాప్ రెడ్డి
- నాలుగు మండలాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు,పాఠశాలలను సందర్శన


గంగవరం మండలం జగ్గంపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారితో మాట్లాడుతున్న ప్రతాప్‌రెడ్డి

రంపచోడవరం: అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన ఆహార పదార్థాలు అందిస్తున్నట్టు రాష్ట్ర ఫుడ్ కమిటీ చైర్మన్ సీహెచ్ విజయ ప్రతాప్ రెడ్డి తెలిపారు. ఆయన మంగళవారం రంపచోడవరం, వై.రామవరం, అడ్డతీగల, గంగవరం మండలాల్లో పర్యటించి, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలను సందర్శించారు. రంపచోడవరం మండలంలో గాంధీనగరం, రంప అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు పిల్లలకు తాజాగా తయారు చేసిన ఆహార పదార్థాలు సకాలంలో నిబంధనల ప్రకారం వండి పెట్టాలన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి అంగన్‌వాడీ కేంద్రాలకు త్వరలో టీవీలు సరఫరా అవుతాయని చెప్పారు. అనంతరం రంప జీపీఎస్‌ను ఆయన సందర్శించారు. విద్యార్థులకు పెట్టే గుడ్లు 50 గ్రాముల కంటే తక్కువ తూకం ఉండడంతో సంబంధిత కాంట్రాక్టర్లతో ఫోన్లో మాట్లాడారు. తక్కువ బరువు ఉన్న గుడ్లు సరఫరా చేస్తే కాంట్రాక్ట్ రద్దు చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా శిశు సంక్షేమ శాఖ పీడీ సూర్యలక్ష్మి, సివిల్ సప్లై డిప్యూటీ డైరెక్టర్ పి.సురేష్ , జిల్లా సివిల్ సప్లై అధికారి ఆర్.శివ ప్రసాద్, జీసీసీ డివిజనల్ మేనేజర్ జి.పార్వతీశ్వరరావు. డీడీ జాన్ రాజ్, సివిల్ సప్లై డీఎం గణేష్ కుమార్, సీడీపీవోలు సంధ్యారాణి, ప్రసన్న కుమారి. ఏఎంవో సి.శ్రీహరి,ఎంఈవో ఎం.సత్యనారాయణ దొర, జీసీసీ సీనియర్ మేనేజర్ మూర్ల నాగ రాజారెడ్డి పాల్గొన్నారు.

అడ్డతీగల: అడ్డతీగలలోని రెండు పాఠశాలలతో పాటు జీసీసీ గొడౌన్‌ను రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయప్రతాప్‌రెడ్డి మంగళవారం తనిఖీ చేశారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అందుతున్న ఆహారంపై ఆరా తీశారు. గురుకుల పాఠశాలను సందర్శించారు. అనంతరం జీసీసీ గొడౌన్ తనిఖీ చేశారు.

వై.రామవరం: మండలంలోని కోట, దాలిపాడు గ్రామాల్లోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలను ఏపీ ఫుడ్ కమిటీ చైర్మన్ సందర్శించారు. మెరుగైన విద్యనందిస్తూ, మెనూప్రకారం భోజనం పెట్టాలని సూచించారు. తహసీల్దార్ ఎ.తాతారావు, డిప్యూటీ తహసీల్దార్ కె.సుధాకర్, ఎంపీపీ కడబాల ఆనందరావు, జెడ్పీటీసీ కర్ర వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీలు ముర్ల జోగిరెడ్డి, ఎంపీటీసీ వీరమళ్ళ సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

గంగవరం : మండలంలో జగ్గంపాలెం, జియ్యంపాలెం, కొత్తాడ, టేకులవీధి, గంగవరం, చినగార్లపాడు గ్రామాల్లో గల ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, వసతిగృహాలను రాష్ట్రఫుడ్ కమిషన్ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి ఆకస్మికంగా సందర్శించారు. ఈసందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ జాతీయ ఆహార భద్రత చట్టానికి లోబడే రాష్ట్ర ఫుడ్ కమిషన్ పనిచేస్తుందన్నారు. జిల్లాలో రంపచోడవరం ప్రాంతంలో అంగన్‌వాడీల నిర్వహణ, పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు సంతృప్తికరంగా ఉందన్నారు. అనంతరం జగ్గంపాలెం గ్రామంలో ఉపాధి కూలీలతో మాట్లాడారు. 2002లో ఉమ్మడి ఆంధ్రాలో రెండో మోడల్ పోలీస్ స్టేషన్‌గా పేరొందిన గంగవరం పోలీస్ స్టేషన్ భవనాన్ని ఆసక్తిగా తిలకించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఏఎస్ఐ రజాక్, ఆహార కమిషన్ డిప్యూటీ డైరెక్టర్ పి.సురేష్, డీఎస్‌వో శివ ప్రసాద్, సివిల్ సప్లై కార్పొరేషన్ మేనేజర్ గణేష్, ఏఎస్‌వో శ్రీహరి, ఐసీడీఎస్ పీడీ వరలక్ష్మి, గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ జాన్‌రాజ్, తహసీల్దార్ ఎం. శ్రీమన్నారాయణ, సహాయ గిరిజన సంక్షేమాధికారి ఎం. హాసిని, ఐసీడీఎస్ సీడీపీవో సీహెచ్.లక్ష్మి, ఆర్ఐ ఫయాజ్‌భాషా(జిలానీ) గంగవరం, రంపచోడవరం ఎంఈవోలు మల్లేశ్వరరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పూలే సేవలు చిరస్మరణీయం


పూలే చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

చింతపల్లి: మహాత్మా జ్యోతిరావు పూలే సేవలు మరువలేనివని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలోని ఎర్రబొమ్మల పంచాయతీ కొండవంచులలో మంగళవారం పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు.ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.పూలే సేవలను ఆమె గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అనూషదేవి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మోరి రవి, చింతపల్లి సర్పంచ్ దూరియ పుష్పలత,ఎర్రబొమ్మల సర్పంచ్ పండన్న,స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ మీరా,అరకు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి గణబాబు, కో–ఆప్షన్ సభ్యుడు నాజర్‌వలీ పాల్గొన్నారు.

రంపచోడంవరం డిగ్రీ కళాశాలకు నాక్ గుర్తింపు


అధ్యాపకులతో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు

రంపచోడవరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు నాక్ గుర్తింపు లభించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. నాక్ 'బి' గ్రేడ్ మంజూరు చేసిందన్నారు. ఈ సందర్భంగా అధ్యాపకులు, సిబ్బందితో ఆయన మంగళవారం సమావేశం నిర్వహించి, ఇందుకు సహకరించిన వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఐక్యూఏసీ కోఆర్డినేటర్ చక్రవర్తి , వైస్ ప్రిన్సిపాల్ రవి కుమార్, సీనియర్ అసిస్టెంట్ భరత్, అధ్యాపకులు డాక్టర్ ప్రభాకర్, రాజశేఖర్, శివ కుమారి, గణేష్, వెంకటేష్, రాంజీ, నిరంజన్, ఉషా, సునీత,శ్రావణి,ఆనంద్, నాగు పాల్గొన్నారు.

జనం నోట అభివృద్ధి మాట


ప్రభుత్వ సంక్షేమ పథకాలను గ్రామస్తులకు వివరిస్తున్న ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి


తురసపల్లిలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

- ఎమ్మెల్యేలు భాగ్యలక్ష్మి, చెట్టి పాల్గుణ, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర
- తురసపల్లి, ఎర్మబొమ్మలులో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం

ముంచంగిపుట్టు/చింతపల్లి: గిరిజన గ్రామాల్లో ఎక్కడికి వెళ్లినా జనం నోట జగనన్న చేసిన అభివృద్ధి,సంక్షేమ పాలన మాట వినిపిస్తోందని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, పాడేరు ఎమ్మెల్యే కొట్టగొళ్ల భాగ్యక్ష్మి అన్నారు. వారు ముంచంగిపుట్టు, చింతపల్లి మండలాల్లో జరిగిన జగనన్నే మాభిష్యత్ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ముంచంగిపుట్టు మండలంలోని బంగారుమెట్ట పంచాయతీ తురసపల్లి లో మంగళవారం జగనన్నే మా భవిష్యత్ –మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మల్లికార్జున్ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ,ఉమ్మడి విశాఖ జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్రలు, సచివాలయం కన్వీనర్లు,గృహ సారథులతో కలిసి ఇంటింటికీ వెళ్లి స్టిక్కర్లు అతికించి,ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు,అభివృద్ధి పనులపై వివరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి పాలనలో రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో నడుస్తోందని,అన్ని వర్గాల వారికి సంక్షేమ పథకాలు ఇంటి వద్దకే అందుతున్నాయని అన్నారు. పార్టీలకతీతంగా,అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పాలనను అందిస్తున్నారని చెప్పారు.అనంతరం జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర మాట్లాడుతూ రాష్ట్రంలో నాలుగేళ్లుగా ప్రజా సంక్షేమ పాలన సాగుతోందని, సంక్షేమ పథకాలు ఇంటివద్దనే లబ్ధిదారులు పొందుతున్నారని చెప్పారు. 2024లో మళ్లీ జగన్‌మోహన్ రెడ్డినే ముఖ్యమంత్రిని చేయాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అరిసెల సీతమ్మ,సర్పంచ్‌లు రత్న,రమేష్,ఎంపీటీసీలు కొండమ్మ,సుబ్బలక్ష్మి,సచివాలయ కన్వీనర్లు కొండలరావు,జగన్నాథం తదితరుల పాల్గొన్నారు.

చింతపల్లి మండలంలోని ఎర్రబొమ్మలు పంచాయతీ పరిధిలో జగనన్న మా భవిష్యత్తు..మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో కలిసి ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను వివరించారు. ఇళ్లకు స్టిక్కర్లు అతికించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఇంటింటా సంక్షేమ పథకాలు అందుతున్నాయని, గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంగా గెలిపించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అనూషదేవి, మండల పార్టీ అధ్యక్షుడు మోరి రవి, చింతపల్లి సర్పంచ్ దూరియ పుష్పలత,ఎర్రబొమ్మల సర్పంచ్ పండన్న,స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ మీరా,అరకు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి గణబాబు, కో–ఆప్షన్ సభ్యుడు నాజర్‌వలీ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రైతుబజార్‌లోనే కూరగాయల దుకాణాలు


అధికారులతో సమీక్షిస్తున్న మార్కెట్ కమిటి చైర్మన్ కూతంగి సూరిబాబు

సాక్షి, పాడేరు: స్థానిక పాతబస్టాండ్‌లోని ఎన్టీఆర్ రైతుబజార్‌లోనే కూరగాయల దుకాణాలు నిర్వహించాలని పాడేరు మార్కెట్ కమిటీ చైర్మన్ కూతంగి సూరిబాబు వ్యాపారులకు సూచించారు. డైరక్టర్లు, అధికారులతో కలసి రైతుబజార్‌ను మంగళవారం ఆయన సందర్శించారు. ఇక్కడ వ్యాపారులతో సమావేశం నిర్వహించారు.ఆయన మాట్లాడుతూ పాతబస్టాండ్‌లోని కూరగాయల వ్యాపారులు రోడ్లపై దుకాణాలు ఏర్పాటుతో ట్రాఫిక్ సమస్య అధికంగా ఉందన్నారు. వైస్ చైర్మన్ కొండబాబు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు సత్యవతి, కామేశ్వరరావు, బాబురావు, గోపి, రాజారావు పాల్గొన్నారు.

మన్యంలో భారీ వర్షం


ఏబులం-చాపగెడ్డ ప్రధాన రహదారిపై పడిన భారీ వృక్షం

కొయ్యూరు/గూడెం కొత్తవీధి: మన్యంలో మంగళవారం భారీ వర్షం కురిసింది. రహదారులు జలమయమయ్యాయి. పలుచోట్ల ఈదురు గాలులకు మామిడికాయలు రాలిపోయాయి. కొన్ని చోట్ల విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఏబులం- చాపగెడ్డ మార్గంలో ప్రధాన రహదారిపై భారీ వృక్షం నేలకూలింది. దీంతో కొద్దిసేపు వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది.

అభివృద్ధి వైపు నడవండి... అండగా ఉంటాం

- గిరిజనులకు చింతపల్లి అదనపు ఎస్పీ ప్రతాప్ శివకిషోర్ పిలుపు
- పీకేగూడెంలో సీఆర్‌పీఎఫ్ సివిక్ యాక్షన్ ప్రోగ్రాం
- పెద్ద ఎత్తున తరలివచ్చిన ఆదివాసీ గిరిజనులు


మాట్లాడుతున్న చింతపల్లి అదనపు ఎస్పీ ప్రతాప్ శివకిషోర్, పక్కన సహాయ కమాండెంట్ బీరేంద్రకుమార్, సీఐ అశోక్‌కుమార్


మాజీ మావోయిస్టు దళసభ్యుడు వంతల గాసితో మాట్లాడుతున్న చింతపల్లి అదనపు ఎస్పీ ప్రతాప్ శివకిషోర్

గూడెంకొత్తవీధి : ఏ విషయంలోనూ అధైర్యపడకండి...ప్రభుత్వం అందిస్తున్న చేయూతతో అభివృద్ధి వైపు అడుగులు వేయండి.. మీవెంట అండగా మేం ఉంటాం...దేశరక్షణతో పాటు మావంతుగా గిరిజనులకు సేవలందించేందుకు సిద్ధంగా ఉన్నామని చింతపల్లి అదనపు ఎస్పీ ప్రతాప్‌శివకిషోర్ అన్నారు. మంగళవారం గూడెం కొత్తవీధి సీఆర్‌పీఎఫ్ 234 బెటాలియన్ సహాయ కమాండెంట్ బీరేంద్రకుమార్ ఆధ్వర్యంలో పీకే గూడెంలో సివిక్ యాక్షన్ ప్రోగ్రాం జరిగింది. ఈ కార్యక్రమానికి సమీప గ్రామాల నుంచి అధిక సంఖ్యలో ఆదివాసీ గిరిజనులు హాజరయ్యారు. ముఖ్య అతిథిగా హాజరైన అదనపు ఎస్పీ మాట్లాడుతూ ఆదివాసీ ప్రాంతాలు ఇంతకాలం కేవలం మావోయిస్టుల కారణంగానే అభివృద్ధికి నోచుకోలేదన్నారు. ఇటీవల కాలంలో గిరిజనులంతా అభివృద్ధిని కోరుకుంటున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సైతం గిరిజన గ్రామాల అభివృద్ధికి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నాయన్నారు. ఆదివాసీ గిరిజన గ్రామాల్లో రహదారులు, సెల్ టవర్ల నిర్మాణాలు పూర్తయితే రవాణా, సమాచార వ్యవస్థ మెరుగుపడి గిరిజనులకు ఆదాయ మార్గాలతోపాటు వైద్య సదుపాయాలు సమకూరుతాయన్నారు. సీఆర్‌పీఎఫ్ సహాయ కమాండెంట్ బీరేంద్రకుమార్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో తమ కేంద్ర పారామిలటరీ బలగాలు సేవా భావంతో అనేక సంక్షేమ, సామాజిక కార్యక్రమాలను అమలు చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో భాగంగా గిరిజనులకు దుప్పట్లు, చీరలు, వంటపాత్రలు, యువతకు వాలీబాల్, క్రికెట్ కిట్లు పంపిణీ చేశారు. అనంతరం గిరిజనులతో కలసి చింతపల్లి ఏఎస్పీ, పోలీసు అధికారులు సహపంక్తి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో గూడెంకొత్తవీధి సీఐ అశోక్‌కుమార్, ఎస్‌ఐ అప్పలసూరి, సీఆర్‌పీఎఫ్, సివిల్, ఏపీఎస్పీ పోలీసులు పాల్గొన్నారు.

అజ్ఞాతంలో ఉండి సాధించేది ఏమిటి?

ఇళ్లు, పొలాలు, కుటుంబాలను వదిలి అడవులను పట్టుకుని అజ్ఞాతంలో ఉండి మీరు ఇన్నాళ్లల్లో సాధించింది ఏమిటని చింతపల్లి అదనపు ఎస్పీ ప్రతాప్‌శివకిషోర్ మావోయిస్టులను ఉద్దేశించి అన్నారు. ఏ ఒక్క గిరిజనుడికైనా ఉద్యోగం కల్పించారా? ఉపాధిని ఇచ్చారా అంటూ ప్రశ్నించారు. పీకే గూడెంలో మంగళవారం నిర్వహించిన సివిక్ యాక్షన్ ప్రోగ్రాంకు గతంలో మావోయిస్టు గాలికొండ ఏరియా కమిటీ దళంలో పనిచేసిన మాజీ మావోయిస్టు వంతలగాసి హాజరయ్యారు. అతనితో ఏఎస్పీ కొద్దిసేపు మాట్లాడారు. గిరిజనుల పట్ల నిజంగా మావోయిస్టులకు ప్రేమ, అభిమానం ఉంటే వారు అనాదిగా ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై ప్రభుత్వంపై శాంతియుతంగా పోరాటం చేయవచ్చన్నారు. దీనికి ఆయుధాలు అవసరం లేదన్నారు. గిరిజన ప్రాంతాల్లో ఇన్‌ఫార్మర్ల పేరిట అమాయక గిరిజనులను హత్యలు చేయడం, రహదారులు నిర్మించే యంత్రాలను, సెల్ టవర్లను ధ్వంసం చేస్తే మావోయిస్టుల పట్ల గిరిజనులకు ప్రేమ ఎందుకు కలుగుతుందని అన్నారు. ఇప్పటికైనా అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టు అగ్రనేతలు, దళ సభ్యులు జనజీవన స్రవంతిలోకి వస్తే తాము స్వాగతిస్తామన్నారు.

వైఎస్సార్‌సీపీలో భారీగా చేరికలు


పార్టీలో చేరిన గిరిజనులతో పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి

చింతపల్లిరూరల్ : మండలంలోని ఎర్రబొమ్మల పరిధిలో టీడీపీకి చెందిన 20 గిరిజన కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో మంగళవారం చేరారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి సమక్షంలో వీరంతా పార్టీలో చేరారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు వారు తెలిపారు. పార్టీలు, వర్గాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న గొప్ప ప్రభుత్వంలో చేరుతున్నందుకు గర్వంగా ఉందన్నారు. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి పార్టీ కండువాలు వేసి, ఆహ్వానించారు.

డీ ఫారం పట్టా భూములు పక్కాగా నమోదు


రెవెన్యూ అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి, పాడేరు: ఏజెన్సీలో డి ఫారం పట్టాభూములను పక్కాగా నమోదు చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు.మంగళవారం కలెక్టరేట్‌లో పాడేరు నియోజకవర్గంలోని ఐదు మండలాల తహసీల్దార్‌లు,వీఆర్వోలకు డి ఫారం భూముల గుర్తింపు,రికార్డుల నిర్వహణపై ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ భూములకు, పట్టా భూములకు ల్యాండ్ మ్యాప్‌లు తయారు చేయాలని, పట్టాభూములు, అసైన్డ్ భూముల రికార్డులను సక్రమంగా నిర్వహించి,వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేయాలన్నారు.భూముల రీసర్వేను పకడ్బందీగా నిర్వహించాలని,వీఆర్వోలకు ప్రభుత్వ భూములు,పట్టా భూములపై సమగ్ర అవగాహన ఉండాలన్నారు.ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్,సబ్‌కలెక్టర్ వి.అభిషేక్,సర్వేశాఖ ఏడీ మోహన్‌రావు,ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు బాసటగా ఎస్టీ కమిషన్


గిరిజనులతో మాట్లాడుతున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ రవిబాబు, ఎంపీపీ నీలవేణి తదితరులు

అనంతగిరి: గిరిజనులకు ఎస్టీ కమిషన్ అండగా ఉంటుందని, ఎస్టీ కమిషన్ చైర్మెన్ కుంభా రవిబాబు అన్నారు.రొంపల్లి పంచాయతీ చినకొనెల, బూరుగు గ్రామాల్లో ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభా రవిబాబు, రెవిన్యూ అధికారులతో కలిసి మంగళవారం పర్యటించారు. గిరిజనులు ప్రమేయం లేకుండానే చిన కోనెల, బూరుగు గ్రామాల్లో సుమారు 120 ఎకరాలు భూములు రుణాలు పేరిట రికార్డులను తారుమారు చేసినట్లుగా గిరిజనులు ఎస్టీకమిషన్ ముందు వాపోయారు. ఈ సందర్భంగా ఎస్టీ కమిషన్ చైర్మన్ రవి బాబు మాట్లాడుతూ భూములు రిజిస్ట్రేషన్ అన్యాయంగా జరిగినట్లుగా తెలిసిందని, సమగ్ర విచారణతో అధికారులు త్వరగా నివేదికను, జిల్లా కలెక్టర్‌తో పాటుగా ఎస్టీ కమిషన్‌కు అందజేయాలని ఆదేశించారు. భూములు విచారణ అనంతరం బాధ్యులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదుచేస్తామన్నారు. అనంతరం గిరిజనులు ఇళ్లను సందర్శించి, గిరిజనులతో మమేకమైయ్యారు. వారి స్థితిగతులపై అడిగితెలుసుకుని, చల్లించిపోయారు. ఎస్టీ కమిషన్ సభ్యురాలు కొర్రా రామలక్ష్మి, ఎంపీపీ శెట్టి నీలవేణి, ఎస్టీసెల్ ప్రధాన కార్యదర్శి శెట్టి గంగాధరస్వామి, తహసీల్దార్ రాంబాయి, ఎంపీటీసీ మితుల, సర్పంచ్‌లు అప్పారావు, మజ్జి అప్పారావు, కో ఆప్షన్ సభ్యుడు మదీనా, నాయకులు చిన్నారావు, విజయ్, భాస్కరరావు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాపై ఫిర్యాదు


కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు ఫిర్యాదు చేస్తున్న ఎంపీపీ వరహాలమ్మ తదితరులు

పెదబయలు: పెదబయలు మండలంలో ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని కోరుతూ కలెక్టర్ సుమీత్ కుమార్‌కు మంగళవారం ఫిర్యాదు చేసినట్టు ఎంపిపి బొండా వరహాలమ్మ, వైస్ ఎంపిపి రాజుబాబు తెలిపారు. సీతగుంట,అరడకోట,గలగండ పంచాయతీల పరిధిలోని మత్స్యగెడ్డకు అనుకుని పెద్ద ఎత్తున అక్రమ ఇసుక రవాణా జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. స్పందించి సమస్య పరిష్కరించాలని కోరినట్టు తెలిపారు. మండల ఎంపీటీసీ ఫోరం అధ్యక్షుడుబొంజుబాబు, సర్పంచ్ పూజారి లోయితాస్ ఉన్నారు.

మారుజాతి కలప పట్టివేత


అటవీ అధికారులు కలపతో పాటు సీజ్ చేసిన ట్రాక్టర్

రాజవొమ్మంగి : మండలంలోని గొబ్బిలమడుగు అటవీప్రాంతం నుంచి 16 మారు జాతి (బిళ్ళ) కలప దుంగలతో తరలిపోతున్న ఏపీ 39 ఎస్‌ఎం 6683 నెంబర్ గల ట్రాక్టర్‌ను రాజవొమ్మంగి అటవీఅధికారులు పట్టుకొన్నారు. దీనిని స్థానిక అటవీక్షేత్ర కార్యాలయానికి తరలించారు. సోమవారం అర్ధరాత్రి ఈ సంఘటన జరిగింది. కలప విలువ రూ.22,847 ఉంటుందని ఆ ప్రాంతంలో విధుల్లో వున్న అటవీఅధికారి బాపిరాజుదొర తెలిపారు. వాహనాన్ని సీజ్ చేసి మల్లికార్జున అనే వ్యక్తిపై కేసు నమోదు చేసామన్నారు. ఈ దాడిలో దొరమామిడి, పాపంపేట బీటు అటవీ అధికారులు అర్జునుడు, లక్ష్మి పాల్గొన్నారు.

ఏజెన్సీలో ఇటుకల పండగ సందడి


జెడ్పీటీసీ వెంకటలక్ష్మి వద్ద తాసేరు వసూలు చేస్తున్న గిరిజన మహిళలు

జి.మాడుగుల : అల్లూరి జిల్లా ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన గూడేల్లో ఇటుకల పండగ సందడి నెలకొంది. పండగలో భాగంగా జి.మాడుగుల మండలంలో గిరిజనులు తమ సంప్రదాయాల్ని కొనసాగిస్తున్నారు. గ్రామాల్లో మహిళలు గుంపులుగా ఏర్పడి రోడ్లపైకి వచ్చి, తాళ్లు, కర్రలు అడ్డంపెట్టి వాహనదార్లు వద్ద తాసేరు(డబ్బులు) వసూలు చేస్తున్నారు. తాసేరు ఇవ్వని వారిపై నీళ్లు జల్లుతారు. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా మంగళవారం జి.మాడుగుల-భీరం రోడ్డులో వనెల్బ గ్రామానికి వెళ్తున్న వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు, జెడ్పీటీసీ డాక్టర్ మత్స్యరాస వెంకటలక్ష్మి వాహనాన్ని గిరిజన మహిళలు నిలిపి, ఆమె నుంచి తాసేరు వసూలు చేశారు. గిరిజన గ్రామాల్లో సంప్రదాయం మేరకు ఈ పండగను నెల రోజుల పాటు నిర్వహిస్తారు.

వ్యాన్ బోల్తా.. ముగ్గురికి గాయాలు


సంఘటన స్థలంలో ఉన్న స్థానికులు

అరకులోయ రూరల్ : మండల కేంద్రం సమీపం వజ్రాల మెట్ట, హెలిప్యాడ్ మైదానంలో మంగళవారం అరకులోయ నుంచి చిన్నలబుడు పంచాయతీ పకనకుడి గ్రామానికి వెళుతున్న బొలెరో పికప్ వ్యాన్ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో హుకుంపేట మండలం గతుం పంచాయతీ అమలగిరి గ్రామానికి చెందిన కిల్లో బన్ని(17), చిన్నలబుడు పంచాయతీ పకనకుడి గ్రామానికి చెందిన శ్యామ్(18)రమేష్(17) గాయపడ్డారు. కిల్లో బన్నికి కుడి కాలు విరిగిపోగా, మిగిలిన ఇద్దరూ స్వల్పంగా గాయపడ్డారు. సమాచారం తెలుసుకున్న సోషల్ మీడియా జిల్లా ప్రధాన కార్యదర్శి రంజిత్‌కుమార్, చిన్నలబుడు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు లక్ష్మణ్‌కుమార్, పూర్ణచందర్‌లు క్షతగాత్రులను స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. మెరుగైన చికిత్స కోసం కిల్లో బన్నిని విశాఖ కేజీహెచ్‌కు తరలించినట్టు వారు తెలిపారు.

మౌలిక సదుపాయాల కల్పనే ప్రభుత్వ లక్ష్యం


రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర

ముంచంగిపుట్టు: ప్రతి గ్రామానికి మౌళిక సదుపాయలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. ముంచంగిపుట్టు మండలం బంగారుమెట్ట పంచాయితీ తురసపల్లి గ్రామంలో జెడ్పీ నిధులు 10లక్షల రూపాయలతో నూతన సీసీ రోడ్డు పనులకు మంగళవారం ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్రలు ప్రత్యేక పూజలు నిర్వహించి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాల్గుణ మాట్లాడుతూ మన్యంలో గిరిజన గ్రామాలకు మహర్దశ నెలకొందని ప్రతి గ్రామానికి పక్క రహదారి కల్పనకు ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు.జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంపీపీ అరిసెల సీతమ్మ, సర్పంచ్‌లు రత్న, రమేష్, ఎంపీటీసీలు కొండమ్మ, సుబ్బలక్ష్మీ, మండల పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ పాల్గొన్నారు.

మహిళలకు అండగా జగనన్న


ముంచంగిపుట్టులో చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే పాల్గుణ, జెడ్పీ చైర్ పర్సన్ సుభద్ర, నేతలు


రంపచోడవరంలో చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి

ముంచంగిపుట్టు: మహిళలకు అండగా జగనన్న ప్రభుత్వం ఉంటుందని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండల కేంద్రంలో స్థానిక వెలుగు కార్యాలయంలో మంగళవారం మూడవ విడత వైఎస్సార్ ఆసరా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్రల చేతుల మీదగా 374 స్వయం సహయ సంఘాలకు చెందిన 3369 మంది మహిళాలకు రూ.63,14,464 చెక్కును మహిళాలకు అందించారు. మహిళాలంతా ఆసరా చెక్కులు పంపిణీతో సంతోషంతో ముఖ్యమంత్రి జగనన్న చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాల్గుణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అక్కచెల్లెళ్లకు నిరంతరం బాసటగా నిలుస్తున్నారని, మహిళల అభ్యున్నతికి అనేక పథకాలు అందిస్తున్నారన్నారు. జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర మాట్లాడుతూ మహిళాలు ఆర్థిక అభివృద్ధే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారని అన్నారు. ఎంపీపీ అరిసెల సీతమ్మ, మండల పార్టీ అధ్యక్షులు మల్లికార్జున్, సర్పంచులు రమేష్, రత్నకుమారి, బాబురావు, ఎంపీటీసీలు సుబ్బలక్ష్మీ, కొండమ్మ, ఎంపీడీవో రమేష్, ఏపీఎం దేవమంగ, నేతలు మత్స్యలింగం, కొండలరావు, జగన్నాథం పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి: ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

రంపచోడవరం: మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి చెప్పారు. మండల కేంద్రంలోని మంగళవారం జరిగిన వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలంలోని 640 మహిళా సంఘాల గ్రూపులకు సంబంధించిన 5199 మంది మహిళా సంఘ సభ్యులకు రూ. 2,24,54,000 మహిళా సంఘాలకు రుణాలు మంజూరు చేశామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధనలక్ష్మి మాట్లాడుతూ అర్హులందరికీ పథకాలను ప్రభుత్వం అందజేస్తోందని, సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. సమావేశంలో ముఖ్యమంత్రి సందేశాన్ని వెలుగు ఏపీడీ ఎ.శ్రీనివాసరావు చదివి వినిపించారు. అనంతరం ఆసరా పథకం చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మహిళలు సీఎం వైస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఎంపీపీ బంధం శ్రీదేవి. జెడ్పీటీసీ పండా వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీలు బాలకృష్ణ, కుమారి, సర్పంచ్ బొజ్జయ్య, ఎంపీటీసీలు లక్ష్మి, వెంకటేశ్వర్లుదొర, ఖాజా వలీ, వ్యవసాయ కమిటీ చైర్మన్ రత్నం రాజు. అన్నవరం దేవస్థానం డైరెక్టర్ పూజ, ఏపీడీ శ్రీనివాసరావు, నేతలు రుతూ. సుధీర్ పాల్గొన్నారు.

నాణ్యతలోపిస్తే విద్యాకానుక కిట్లు వెనక్కి

జగనన్న విద్యాకానుక రీజనల్ డైరెక్టర్ సుబ్బారెడ్డి


జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో గదులు పరిశీలిస్తున్న ఆర్జేడీ సుబ్బారెడ్డి

రాజవొమ్మంగి: విద్యాకానుక కిట్ల నాణ్యత బాగోలేకపోతే వెనక్కి పంపించవచ్చని జగనన్న విద్యాకానుక రీజనల్ డైరెక్టర్ సుబ్బారెడ్డి తెలిపారు. ఆయన మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాకానుక కిట్ల పరిశీలన టీంగా స్థానిక విద్యాశాఖాధికారి, వెలుగు ఏపీఎం, మండల ఇంజినీర్ వ్యవహరిస్తారని సుబ్బారెడ్డి విలేకరులకు తెలిపారు. కిట్లపంపిణీ టీంలో ఎంఈవో, సీఆర్పీలు, ఆయా పాఠశాలల సిబ్బంది ఉంటారన్నారు. కిట్లలో నాణ్యతాప్రమాణాలు పరిశీలించి నాణ్యత లేకపోతే తిప్పి వెనుకకు పంపే అధికారం పరిశీలన టీం అధికారులకు ఉందన్నారు.విద్యాకానుక కిట్లను మండలకేంద్రంలో భద్రపరచేందుకు స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో నాలుగు గదులు కేటాయించారు.

నేడు వాలీబాల్ టోర్నీ ప్రారంభం


మాట్లాడుతున్న సీఐ సత్యనారాయణ

పెదబయలు: ఇంజరి పంచాయతీ కేంద్రంలో జిల్లా పోలీసు ఆధ్వర్యంలో యువహో మెగా వాలీబాల్ టోర్నీ నిర్వహించడం జరుగుతుందని జి.మాడుగుల సీఐ ఎ.సత్యనారాయణ తెలిపారు. వాలీబాల్ టోర్నీ ప్రారంభానికి ఎస్పీ తుహిన్ సిన్హా, పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ హాజరవుతారని తెలిపారు. టోర్నీకి పెదబయలు మండలంలోని ఇంజరి, జామిగుడ, గిన్నెలకోట, బొంగరం, లింగేటి, జి.మాడుగుల మండలం బొయితిల పంచాయతీల నుంచి 50 జట్లు పోటీల్లో పాల్గొన్నాంటాయని తెలిపారు.గెలిచిన జట్లకు ఎస్పీ, ఐటీడీఏ పీవో చేతుల మీదుగా బహుమతుల ప్రదానం జరుగుతుందన్నారు. ప్రథమ స్థానం నిలిచిన జట్టుకు రూ.25 వేలు, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన జట్లకు రూ.15 వేలు, 10 వేలు చొప్పున అందించడంతో పాటుగా మ్యాచ్ ఆడే ప్రతీ జట్టుకు డ్రస్ కోడ్‌తో పాటుగా ఉచితంగా భోజన సదుపాయం కల్పించనున్నట్టు తెలిపారు. సంజీవని మెగా మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నామని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కేజీహెచ్ ఎస్టీ సెల్ ప్రక్షాళన

- ఈ కేంద్రం పనితీరుపై కొంతకాలంగా విమర్శలు
- మొత్తం సిబ్బంది బదిలీ.. కొత్తగా 11 మంది నియామకం
- అల్లూరి జిల్లా డీఎంహెచ్‌వో నిర్ణయం

మహారాణిపేట(విశాఖపట్నం): ఆరోపణలు ఎదుర్కొంటున్న కేజీహెచ్‌లోని ఎస్టీ సెల్ ప్రక్షాళనకి అధికార యంత్రాంగం శ్రీకారం చుట్టింది. ప్రస్తుతం ఇక్కడ ఉన్న సిబ్బందిపై బదిలీ వేటు వేసి.. కొత్త సిబ్బందిని నియమించింది. కేజీహెచ్‌కు మన్యం ప్రాంతానికి చెందిన 11 మండలాల గిరిజనులు, ఉమ్మడి ఉత్తరాంధ్ర ప్రాంతం, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ తదితర ప్రాంతాలకు చెందిన గిరిజనులు వైద్యం కోసం వస్తుంటారు. నెలకు నాలుగు వేల మంది వరకు చికిత్స పొందుతుంటారు. ఈ నేపథ్యంలో గిరిజనుల బాగోగుల కోసం పాడేరు ఐటీడీఏ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పర్యవేక్షణలో గిరిజన సేవా, సమాచార కేంద్రం పేరిట కేజీహెచ్‌లో ప్రత్యేకంగా ఎస్టీ సెల్ ఏర్పాటు చేశారు. ఇక్కడ 9 మంది సిబ్బందితో సేవలు ప్రారంభించగా.. తర్వాత కాలంలో నలుగురితో నడిచింది.

సిబ్బంది ఇష్టారాజ్యం

గిరిజనుల వైద్యం కోసం ప్రభుత్వం ఎక్కువ మొత్తంలో నిధులు వెచ్చిస్తోంది. అనారోగ్యంతో వచ్చే గిరిజనులను వైద్యులకు చూపించడం, అవసరమైన పరీక్షలు, స్కానింగ్ చేయించడం ఈ సెల్ ఉద్యోగుల బాధ్యత. గిరిజనులకు భోజనాలు, మందులు, తిరిగి ప్రయాణానికి ఖర్చులు కూడా ఇవ్వాల్సిందే ఈ సెలే. కానీ ఇందుకు భిన్నంగా ఇక్కడ జరుగుతోంది. అన్ని ఉచితంగా ఇవ్వాల్సిన చోట గిరిజనుల దగ్గర నుంచి ఇక్కడ సిబ్బంది డబ్బులు తీసుకుంటున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఎవరి పర్యవేక్షణ లేకపోవడంతో సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. దీనికి తోడు ఇటీవల జరిగిన రెండు సంఘటనలతో ఎస్టీ సెల్‌పై విమర్శలు వెల్లువెత్తాయి. కేజీహెచ్‌లో మృతి చెందిన పసికందును సొంత గ్రామం తరలించడానికి అంబులెన్స్ ఇవ్వకపోవడంతో చిన్నారి తండ్రి బైక్‌పై తీసుకెళ్లడం, గిరిజన మహిళకు మంచం ఇవ్వకపోవడంతో రాజేంద్రప్రసాద్ వార్డులో కిందనే నిద్రించడం తదితర సంఘటనలు సంచలనమయ్యాయి. దీంతో ఎస్టీ సెల్ ప్రక్షాళనపై యంత్రాంగం దృష్టి పెట్టింది. ఇటీవల రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్టీ సెల్ పనితీరుపై ఆరా తీశారు. కలెక్టర్ మల్లికార్జున, అల్లూరి డీఎంహెచ్‌వో తదితరులు మంత్రితో మాట్లాడుతూ ఎస్టీ సెల్‌కు అదనపు సిబ్బందిని నియమించాలని, నిధులు పెంచాలని, అంబులెన్స్‌లు సమకూర్చాలని కోరారు.

సిబ్బంది బదిలీ

ఎస్టీ సెల్‌కు మొత్తం 11 మంది సిబ్బందిని కేటాయించినట్టు అల్లూరి సీతారామరాజు జిల్లా డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్ భాషా చెప్పారు. గతంలో పనిచేసిన సిబ్బందితో పాటు సెల్ ఇన్‌చార్జి రామకృష్ణను కూడా బదిలీ చేశామన్నారు. తాజాగా ఇద్దరు వైద్యులు, ముగ్గురు స్టాఫ్ నర్సులు, ముగ్గురు ఎంఎన్‌వోలు, ఇద్దరు డ్రైవర్లు, సిబ్బంది ఒకరిని నియమించినట్లు వెల్లడించారు. ఈ సెల్ పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తామన్నారు. అలాగే రెండు అంబులెన్స్‌లు కూడా కేటాయించామని అల్లూరి డీఎంహెచ్‌వో వెల్లడించారు.